మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

# వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు..

- ఉత్తరద్వారం ద్వార స్వామి వారిని దర్శించుకొన్న భక్తులు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ఘనంగా శేషవాహనసేవ



**దేవరకద్ర, జనవరి 02 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి పర్వదిన వేడుకలను అత్యం త ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా ధనుర్మాసంలో దేవస్థానంలో ఈ వేడుకలను విశేషంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ మన్యంకొండలో వైకుంఠ ఏకాదశి(ముక్కోటి) పర్వదిన వేడుకలను సాంప్రదాయరీతిలో నిర్వహించారు. దీనికి గాను దేవస్థానం వద్ద భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో మన్యంకొండ భక్తజనసందోహంతో పులకించి పోయింది.



మన్యంకొండలో ఉత్తరద్వారంలో దర్శనమిస్తున్న స్వామివారు

**ఉత్తరద్వారం ద్వార స్వామివారి దర్శనం..**

వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి పర్వదిన వేడుకలను పురస్కరించుకొని మన్యంకొండలో స్వామివారు సోమవారం ఉత్తరద్వారం ద్వార భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా దేవస్థానంలో ఏర్పాటుచేసిన ఉత్తరద్వారాన్ని రకరకాల పూలతో శోభాయమానంగా అలంకరించారు. ఉపవాసం ఉండి ఉత్తరద్వారం ద్వార మహావిష్ణువును దర్శించుకోవడం ద్వార వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని భావించిన భక్తులు జిల్లా నలుమూలల నుండి మన్యంకొండకు వేలాదిగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని తరించారు. వివిధ ప్రాంతాలనుండి వచ్చిన భక్తులు దేవస్థానం కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకొన్నారు. ఉదయం 7 నుండి భక్తులు స్వామి వారి దర్శనానికి బారులుతీరారు. ఈ సందర్భంగా స్వామివారిని అలంకరించి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్, నరసింహ్మయ్య, పాలకమండలి సభ్యులు, పర్యవేక్షకుడు నిత్యానందచారి, సిబ్బంది సుదర్శన్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా శేషవాహనసేవ..**

మన్యంకొండ శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం తెల్లవారుజామున వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని స్వామివారి శేషవాహనసేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయరీతిలో ఈ వ్రత వేడుకను కన్నులపండువలా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న రథ మండపం వరకు ఈ సేవ నిర్వహించారు. పురోహితుల వేధ మంత్రాలు, భక్తులహరినామశ్చరణ, కాగడాల వెలుతురులో స్వామి వారి సేవ ముందుకు కదిలింది. ఈ సేవను చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలను నిర్వహించారు. అనంతరం స్వామి వారిని మళ్ళి గర్భగుడి లోకి తీసుకెళ్ళారు. అక్కడ కూడ వివిద పూజలను నిర్వహించారు.





**అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు..**

మన్యంకొండలో శేషవాహనసేవ పూజ సందర్భంగా స్వామి వారు దేవస్థానం ఆవరణలో శేషవాహనంపై ఊరేగుతూ అలంకరణలో భక్త కోటికి దర్శనమిచ్చారు. రకరకాల పూలు, బంగారు ఆభరణాలతో స్వామివారిని అలంకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్, నరసింహ్మయ్య, పాలకమండలి సభ్యులు, పర్యవేక్షకుడు నిత్యానందచారి, సిబ్బంది సుదర్శన్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలంతా బాగుండాలి..

**బీఆర్ఎస్‌కు దేశవ్యాప్తంగా మద్దతు పెరగాలి**
**తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్**



**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జనవరి2, ప్రభాతవార్త:** వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలతో పాటు దేశప్రజలందరూ బాగుండాలని కోరుకున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్‌కు స్వామివారి ఆశీస్సులు ఉండాలని కోరారు. బీఆర్ఎస్‌కు దేశవ్యాప్తంగా మద్దతు పెరగాలని, మహబూబ్‌నగర్ ప్రజలు సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. మంత్రి వెంట గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా చైర్మన్ వెంకన్న పీఏసీసీఎస్ చైర్మన్ జూపల్లి భాస్కరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేశ్వర్, నాయకులు కృష్ణమోహన్, శివరాజ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి..

**తెల్లవారుజాము నుంచే బారులుదీరిన భక్తులు**
**జడ్చర్లలో ప్రత్యేక పూజలు తీసుకున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**



**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జనవరి2, ప్రభాతవార్త:** ముక్కోటి ఏకాదశి సందర్భంగా వైష్ణవాలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున 3గంటల నుంచే దర్శనభాగ్యం కల్పించడంతో భక్తులు బారులుదీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేశారు. జడ్చర్లలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మీరవీందర్, కౌన్సిలర్లు, నాయకులు రామ్మోహన్, బీకేఆర్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో ఎమ్మెల్యే ఆల



**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జనవరి2, ప్రభాతవార్త:** వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి దర్శించుకున్నారు. ఈమేరకు కుటుంబ సమేతంగా తిరుమల చేరుకొని స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భూత్పూర్ మండలంలోని అన్నాసాగర్‌లో పునర్‌నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రతిష్ఠించేందుకు తిరుపతిలో విగ్రహాలను పరిశీలించారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు.

# పేదింట కల్యాణ కాంతులు..!

**ఆడబిడ్డల తల్లిదండ్రుల ఆవేదన గుర్తించిన సీఎం కేసీఆర్**
**కల్యాణలక్ష్మితో తొలగిన ఆర్థిక ఇబ్బందులు: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జనవరి 2, ప్రభాతవార్త:** పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రులు పెండ్లి చేసేందుకు పడుతున్న ఇబ్బందులను చూసే సీఎం కేసీఆర్ పెద్దమనస్సుతో కల్యాణలక్ష్మి పథకాన్ని రూపొందించి రూ.లక్షానూటపదహారు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. బాలానగర్ మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 80మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో సుమారు రూ.12కోట్ల విలువ చేసే కల్యాణలక్ష్మి చెక్కులను అందజేసినట్లు తెలిపారు. అంతకముందు మండలంలోని 9మంది బాధితులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.8.40లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు. గతంలో సీఎంఆర్ఎఫ్ అంటే కేవలం పెద్ద నాయకులకు మాత్రమే అన్నట్లు ఉండేదని, కానీ ప్రస్తుతం ఏ ఒక్క పేద కుటుంబం కూడా ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడొద్దని, కార్పొరేట్ స్థాయిలో వైద్యం చేయించుకోవాలని సీఎం సహాయనిధి నుంచి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అంతకముందు నవాబుపేట మండలంలోని ఫత్తేపూర్ మైసమ్మ ఆలయ ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే నవాబుపేటలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో గిరిజన కార్పొరేషన్ చైర్మన్ వాల్యానాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రభుత్వం వచ్చాక అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసింది..

**బాల్య వివాహాలు అరికట్టాలి..**
**ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు జరిపేలా చర్యలు తీసుకోవాలి..**
**రాష్ట్ర గిరిజన అభివృద్ధి, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్.**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 02 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం వచ్చాక అంగన్వాడీ కేంద్రాలలో పేద గర్భిణీలు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తూ బలోపేతం చేసిందని రాష్ట్ర గిరిజన అభివృద్ధి స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. సోమవారం అలంపూర్ శ్రీజోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించిన అనంతరం స్థానిక అతిథి గృహంలో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, సఖి సెంటర్, భరోసా, చైల్డ్‌లైన్, బాల్య వివాహాలపై, చిల్డ్రన్ హోమ్ తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహివచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ఎన్ని అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని, ఎన్ని పోస్టులు ఖాళీ ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పోస్టులు ఎన్ని ఉన్నా వాటిని భర్తీ చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. పేద గర్భిణీలకు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారాన్ని ప్రతి రోజు తప్పక అందించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరికి పౌష్టికాహారం అందజేయాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలు గతంలో సరిగా అవగాహన లేక ఎవరు వెళ్లలేకపోయారని తెలంగాణ ప్రభుత్వం వచ్చాక అంగన్వాడీ కేంద్రాలకు అన్ని వసతులు కల్పించి బాలామృతం ప్లస్, న్యూట్రిషన్ కిట్ అందజేయడం జరుగుతుందని అన్నారు. గ్రామాలలో సీడీపీవోలు, అంగన్వాడీ టీచర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. కాన్పులు ఎక్కడ నిర్వహిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. దీనికి అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ సమాధానిమస్తూ ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పులు జరిగేలా ప్రతి గర్భిణీ కుటుంబ సభ్యులతో అవగాహన కల్పించి



సమావేశంలో మాట్లాడుతున్నరాష్ట్ర గిరిజన అభివృద్ధి స్త్రసీ,శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్

అధిక మొత్తంలో ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు జరిపేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఆపరేషన్ స్మైల్ ఎలా నడుస్తుందని మంత్రి అడిగారు. బాల్యవివాహాలపై మాట్లాడుతూ బాల్యవివాహం జరిగే రోజు కంటే ముందే సమాచారం తెలుసుకొని బాల్య వివాహాలను అరికట్టాలని అన్నారు. తల్లిదండ్రులకు ఒప్పించి పిల్లల ఉన్నత చదువులకు అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పెళ్లి ఈడు వచ్చాక వివాహం చేసేలా తల్లిదండ్రులను ఒప్పించాలని అన్నారు. గ్రామాలలో సర్పంచులతో మాట్లాడి చదువుకునే పిల్లలు ఉంటే అంగన్వాడీ కేంద్రాలకు పంపించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు గ్రామాలలో పర్యటించిన సమయంలో తప్పక అంగన్వాడీ కేంద్రాలకు సందర్శించి కేంద్రాల నిర్వహణపై చర్చించాలని అన్నారు. పూర్తిగా బడికి పోని వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని అడగగా ప్రతి మంగళవారం వీసీపీసీ మీటింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు జడ్పీ డిప్యూటీ సీఈఓ ముసాయిదా బేగం తెలిపారు. చిల్డ్రన్ హోమ్ సొంత భవనం నిర్మాణానికి ఈ నెలలోనే తగు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. శ్యామ్, మ్యామ్ పిల్లలు ఉంటే వారిపై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని అన్నారు. 1098, 181 అత్యవసర నెంబర్లను అందరికి తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అవగాహన లేనందునవల్లే గతంలో జరిగిన దిశ సంఘటనలో వారి తల్లిదండ్రులకు ఫోన్ చేశారు కానీ 1098, 181కి ఫోన్ చేయలేదని అన్నారు. సీడీపీఓలు, సూపర్‌వైజర్లు సమన్వయంతో పని చేసి అంగన్వాడీ కేంద్రాలను చురుకుగా నడిపించేలా చర్యలు తీసుకోవాలని, బాల్య వివాహాలు అరికట్టాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలలో పని చేసే టీచర్లు తల్లులుగా మారి మనసుపెట్టి ఉద్యోగం చేస్తున్నారని వారి సేవలు ఇంకా విస్తరించాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్, శిశు సంక్షేమశాఖ అధఙకారి ముసాయిదా బేగం, గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాస్, చైర్మెన్ సహదేవ్, డి.డబ్ల్యూఓ హేమలత, ఎస్టీ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

**విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ**

## సంఘాలు సహకరించాలి...

**టీపీటీయూ క్యాలెండర్ ఆవిష్కరణలో జిల్లా కలెక్టర్**



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 02, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రో గ్రెసివ్ టీచర్స్ యూనియన్ (టీపీటీయూ) 20 23 నూతన సం వత్సర క్యాలెం డర్‌ను జిల్లా కలెక్టర్ పి.ఉద య్‌కుమార్ సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాల సభ్యులు సహకరించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఉపాధ్యాయ సంఘాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు సాయిరెడ్డి కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం సభ్యులు నారాయణచారి, అర్చన, శేఖర్, శివ, రామకృష్ణగౌడ్ తదితరులు ఉన్నారు.

## టెన్త్ పరీక్షల షెడ్యూల్ విడుదల..

**ఏప్రిల్ 3నుంచి13 వరకు నిర్వహణ**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జనవరి2, ప్రభాతవార్త:** పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన పరీక్షల షెడ్యుల్ విడుదల చేసినట్లు మహబూబ్‌నగర్ డీఈవో రవీందర్ సోమవారం తెలిపారు. 2023 వార్షిక సంవత్సర పబ్లిక్ టెన్త్ పరీక్షలు ఏప్రిల్ 3నుంచి ప్రారంభంకానున్నాయి. మొదటి లాంగ్వేజి ఏప్రిల్ 3న, సెకండ్ లాంగ్వేజీ ఏప్రిల్4న, థర్డ్ లాంగ్వేజీ 6న, మ్యాథమెటిక్స్ 8న, సైన్స్ 10న, సోషల్ స్టడీస్ 11న, ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజీ పేపర్1, ఎస్ఎస్‌సీ ఒకేషనల్ 12న, ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజీ పేపర్2 13న పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో తెలిపారు. ఈమేరకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలలకు డీఈవో సర్క్యులర్ జారీ చేశారు.

## సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు చేపట్టాలి



**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 02 ప్రభాతవార్త :** ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి జిల్లా అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల ఆర్జీలను ఆయన స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులను అక్కడే వారు స్వయంగా పరిశీలించి ఆర్జిదారులకుతగు సూచనలు ఇచ్చి మీసేవ ద్వారా దరఖాస్తు పెట్టాలని సూచించారు. ఆర్జీలను పరిశీలించి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, అదనపు కలెక్టర్ పద్మజారాణి, ఆర్డీఓ రామచంద్రనాయక్, ఏఓ నర్సింగ్‌రావు, జిల్లా వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మస్తీ.. ఆమ్దానీ..!

న్యూఇయర్ వేడుకలంటేనే ఫుల్ జోష్. షాపింగ్ మాల్స్, సినిమా హాల్లు, బిర్యానీ పాయింట్లు, హోటళ్లు కిటకిటలాడుతాయి. ఇదంతా ఒక ఎత్తు అయితే మద్యం..లిక్కర్ మరో ఎత్తు. ఇది లేనిది మద్యం ప్రియులకు జోష్ పార్టీ మూడ్ రాదు. అయితే సర్కార్‌కు మాత్రం మూడు బీర్లు...ఆరు లిక్కర్ బాటిళ్లు అనే తరహాలో ఆదాయం తెచ్చి పెడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో నాలుగు ఎక్సైజ్ డివిజన్లు ఉండగా 14 ఎక్సైజ్ సర్కిళ్లు ఉన్నాయి. డిసెంబర్31 ఒక్క రోజే రూ.17కోట్ల మద్యం తాగేశారంటే మద్యం ప్రియులు సర్కార్‌కు ఏ స్థాయిలో ఆదదాయం అందిస్తున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. శనివారం అర్ధరాత్రి 12గంటల వరకు మద్యం అమ్మకాలకు అవకాశం ఇవ్వడంతో మరింత ఆదాయం వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.



- మద్యం ప్రియులు తెగ తాగేశారు
- సర్కారుకు ఆదాయం తెచ్చిపెడుతున్న ఎక్సైజ్‌శాఖ
- 2021 డిసెంబర్‌నెలలో రూ.241.69 కోట్లు..
- గతేడాది డిసెంబర్‌లో రూ.245.50 కోట్ల ఆదాయం
- 31న అర్ధరాత్రి వరకు అవకాశం ఇవ్వడంతో పెరిగిన సేల్
- రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు
- ఒక్కరోజే ఉమ్మడి జిల్లాలో రూ.17.84కోట్ల ఆదాయం

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జనవరి2, ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కొత్త సంవత్సరానికి గ్రాండ్ వెల్‌కమ్ చెప్పారు. రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు జరిగాయి. దీంతో సర్కార్‌కు భారీ ఆదాయం సమకూరింది. గత డిసెంబర్‌తో పోలిస్తే ఐఎంఎల్ కొంత తగ్గినా ఆదాయం మాత్రం పెరిగిందని ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డీసీ దత్తురాజ్‌గౌడ్ తెలిపారు.

**నాలుగు డివిజన్లు , 14 సర్కిళ్లు**

ఉమ్మడి జిల్లాలో మొత్తం నాలుగు డివిజన్లు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల ఉన్నాయి. సర్కిళ్లు 14 జడ్చర్ల, కోస్గి, మహబూబ్‌నగర్, నారాయణపేట, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, తెలకపల్లి, ఆత్మకూరు, కొత్తకోట, వనపర్తి, అలంపూర్, గద్వాల.

**డివిజన్ల వారీగా సేల్ వివరాలు..**

2022 డిసెంబర్ నెలలో..

| డివిజన్ | లిక్కర్ (ఐఎంఎల్) | బీర్లు(కేసులు) | రూ.కోట్లలో.. |
|---|---|---|---|
| మహబూబ్‌నగర్ | 1,23,060 | 1,13,884 | 99.37 |
| నాగర్‌కర్నూల్ | 72670 | 67951 | 61.94 |
| వనపర్తి | 48031 | 34519 | 38.64 |
| గద్వాల | 54393 | 29723 | 41.73 |

2022 డిసెంబర్ నెలలో..

| | | | |
|---|---|---|---|
| | 105994 | 131707 | 102.51 |
| | 58,295 | 68,070 | 58.43 |
| | 43,870 | 43,429 | 41.54 |
| | 46,928 | 36,587 | 43.02 |

**అర్ధరాత్రి వరకు అవకాశంతో..**

డిసెంబర్ 31న అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలకు అవకాశం ఇవ్వడంతో అమ్మకాలు పెరిగి ఆదాయం కూడా పెరిగింది. బార్లకు ఒంటిగంట వరకు పర్మిషన్ ఇవ్వడంతో మద్యం ప్రియులతో కిటకిటలాడాయి. న్యూఇయర్ వేడుకల సందర్భంగా గత వారం నుంచి స్టాక్ పాయింట్ల వద్ద కూడా సందడి నెలకొన్నది. దీంతో గత ఏడాది కంటే కూడా అమ్మకాలు దాదాపు రూ.4కోట్లకుపైగా పెరిగినట్లు అధికారులు తెలిపారు.

**డ్రంకెన్‌డ్రైవ్ కేసులు..**

ఓ వైపు మద్యం అమ్మకాలు పెంచేందుకు అర్ధరాత్రి వరకు టైం ఇచ్చి..మరోవైపు డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి మద్యం ప్రియుల జేబులకు చిల్లులు పడేలా చేశారు. ఒక్క మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోనే 11చోట్ల తనిఖీ చేపట్టి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. 30 మందికి పైగా పట్టుబడడంతో వారికి జరిమానా విధించారు. కొన్ని చోట్ల ర్యాష్ డ్రైవింగ్‌తోపాటు, మైనర్లు వాహనాలు నడుపడంతో వార్నింగ్ ఇచ్చారు.

**రికార్డు స్థాయిలో ఆదాయం..**

ఉమ్మడి జిల్లాలో మహబూబ్‌నగర్‌లో అత్యధికంగా అమ్మకాలు జరిగాయి. అయితే రెండో స్థానంలో జడ్చర్ల నిలిచింది. డిసెంబర్ 31న మహబూబ్‌నగర్‌లో 3.1కోట్ల ఆదాయం రాగా, జడ్చర్లలో రూ.2.56 కోట్ల ఆదాయం వచ్చింది. దీంతో జిల్లావ్యాప్తంగా రూ.17.84 కోట్ల ఆదాయం వచ్చింది. ఇదిలా ఉండగా 2022 డిసెంబర్ నెలలో లిక్కర్ (ఐఎంఎల్)255087 కేసులు సేల్ కాగా, బీర్లు 27,9793 కేసుల బీర్లు తాగడంతో 245.50కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

## సీఎం కేసీఆర్‌కు నూతన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



**కల్వకుర్తి, జనవరి 02, ప్రభాతవార్త:**హైదరాబాద్ ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీఎంను కోరారు. ఇర్విన్ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని, ఎస్‌డీఎఫ్ ద్వారా రూ.100 కోట్లు నియోజకవర్గానికి కేటాయించాలని, నియోజకవర్గానికి 6వేల డబుల్ బెడ్‌రూం ఇండ్లు, కడ్తాల్ గేటు నుంచి పడకల్ గేటుకు డబుల్ రోడ్డుకు రూ.20 కోట్లు కేటాయించాలని, కేఎల్ఐ డీ82 రైతుల పరిహారానికి రూ.27కోట్లు, సమగ్ర గిరిజన అభివృద్ధికి రూ.250కోట్లు కేటాయించాలని సీఎంను కోరారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. స్పందించిన సీఎంకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎంపీ రాములు నిధులతో హైమాక్స్ లైట్లు ప్రారంభం



**వెల్దండ, జనవరి 02, ప్రభాతవార్త:**వెల్దండ మండల పరిధిలోని అజిలాపూర్ గ్రామంలో ఎంపీ రాములు నిధులు రూ.3లక్షలతో గ్రామంలో రెండు చోట్ల హైమాక్స్ లైట్లను ఏర్పాటు చేసి సోమవారం గ్రామ సర్పంచ్ కాలే లక్ష్మమ్మ వెంకటేష్ గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో 2 హైమాక్స్ లైట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిన ఎంపీ రాములుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికై మరిన్ని నిధులను విడుదల చేసి గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. కార్యక్ర మంలో వార్డు సభ్యులు జంగయ్య, గ్రామ కోఆప్షన్ సభ్యులు సర్దార్, భీరప్ప, నిరంజన్, జంగయ్య తో పాటు తదితరులు ఉన్నారు.

## లక్ష్మి వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్న జిల్లా ఛైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య





**కేటిదొడ్డి, జనవరి 02 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొండపై వెలిసిన శ్రీశ్రీశ్రీ పాగుంట లక్ష్మి వెంకటేశ్వరస్వామి దర్శనం ఉత్తర ద్వారం ద్వారా చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం గద్వాల జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు ఇచ్చి శాలువాతో సత్కరించారు. దర్శనానంతరం దేవాలయానికి సంబంధించిన పూలతోటలో మొక్కలు నాటారు. అదేవిధంగా నూతన సంవత్సర, వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కేటిదొడ్డి జడ్పీటిసి రాజశేఖర్, ఎంపిపి మనోహరమ్మ, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉరుకుందు, బండ్ల రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపిపి రామకృష్ణనాయుడు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నల్ల హనుమంతు, గ్రామ సర్పంచ్ ఆంజనేయులు, రైస్‌మిల్లు పాండు, పాతపాలెం శ్రీనివాస్‌గౌడ్, బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## ముందస్తు అరెస్టును ఖండించిన కాంగ్రెస్ నాయకులు..




**వనపర్తి రాజీవ్ చౌక్, జనవరి 02 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్ స్టేషన్ లో కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పాండు సాగర్, వనపర్తి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రొయ్యల రమేష్, పెద్దగూడెం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు గుండాల రాములు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వనపర్తి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రొయ్య రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పిలుపుమేరకు హైదరాబాద్ లో ధర్నా కార్యక్రమానికి మమ్మల్ని వెళ్లకుండా తెల్లవారుజామున పోలీసులు అక్రమ అరెస్టు చేశారన్నారు. ఈ అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కేసీఆర్ ఓ నియంతల రాచరిక పాలన రాష్ట్రంలో కొనసాగిస్తూ స్వేచ్ఛ గా శాంతియుతంగా నిరసన తెలిపే పౌరుల హక్కులను కూడా కాలరాస్తు పాలన కొనసాగించాలనుకుంటున్నారని అన్నారు. ప్రజలు మిమ్మల్ని రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెప్పి ప్రతిపక్షానికి పరిమితం చేస్తారని హెచ్చరిస్తున్నామని అన్నారు.

## సర్పంచుల నిధుల డ్రా, అరెస్టులు సరికాదు..



**వనపర్తి టౌన్, జనవరి 02 ప్రభాతవార్త:** సర్పంచుల ఆమోదం లేకుండా కేంద్రం 15వ ఆర్థిక సంఘం ద్వారా గ్రామ పంచాయితీలకు ఇచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం డ్రా చేయడం ఆందోళనకు సిద్ధమైతే అరెస్టులు చేయడం సరికాదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, కేతెపల్లి మాజీ సర్పంచు పి.కళావతమ్మ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇది సర్పంచుల గౌరవానికి భంగకరమని అన్నారు. పంచాయితీ తీర్మానాలు చేయకుండా నిధులు డ్రా చేస్తే సర్పంచుల పై చట్టపరంగా చర్య ఉందని, అదే పద్ధతి రాష్ట్ర ప్రభుత్వం చేయడం కంచే చేను మేయడం కాగలదన్నారు. పంచాయితీల కరెంటు బిల్లులు, ట్రాక్టర్ల వాయిదాలు, పెండింగ్ బిల్లుల చెల్లింపు తదితర పంచాయితీల అవసరాలకే డ్రా చేసేంత ఆమోదం పొందాల్సిందన్నారు. ఇందిరాపార్క్ వద్ద సోమవారం ధర్నాకు వెళ్లకుండా అరెస్టులు ప్రజాస్వామికమని ఖండించారు.

## అయ్యప్ప స్వామి ఆలయానికి రూ.1లక్ష60 వేల విరాళం..



**వనపర్తి ప్రతినిధి, జనవరి 02 ప్రభాతవార్త:** అయ్యప్ప స్వామి దేవాలయానికి జిల్లా కేంద్రానికి చెందిన యాదాచారి రూ.1లక్ష60వేలు విరాళంగా అందజేశారు. ఈ డబ్బులను ధ్వజస్థంభ సలహారానికి ఖర్చు చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయ కమిటీ అధ్యక్షులు బొల్లంపల్లి నాగేష్, ప్రధాన కార్యదర్శి ముత్తు కృష్ణ గురుస్వామి, కోశాధికారి ప్రతాప్ రెడ్డి, ఆలయ అర్చకులు రమేస్ సిద్ధాంతి చేతులకు విరాళం డబ్బులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అదనపు కార్యదర్శి గట్టువెంకన్న, కార్యనిర్వాహక కార్యదర్శి వాకిటి శ్రీధర్ కమిటీ సభ్యులు ఎల్బీ చారి గురుస్వామి, ఆనంద్ గురుస్వామి, అమ్రేష్, బంగారం, అనిల్, బాలరాజు, ఆర్ఎంపీ పాల్గొన్నారు.

**ఘనంగా ఇరుముడి కార్యక్రమం..**

పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం దేవాలయంలో సోమవారం ఇరుముడి కార్యక్రమం ఘనంగా జరిగింది. ముత్తు కృష్ణ గురుస్వామి, ఆలయ ప్రదాన అర్చకులు రమేష్ శర్మ సిద్ధాంతి, నరేందర్ గురుస్వామి ల ఆధ్వర్యంలో దాదాపు 70మంది అయ్యప్ప మాలదారులు ఇరుముడి ధరించి శబరిమల, యాత్రకు బయలుదేరి వెళ్తారని అన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వచ్చిన భక్తులందరికి అన్నదానం ఏర్పాటు చేశారు.

## వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని మంత్రికి వినతి పత్రం



**ఇటిక్యాల, జనవరి 02 ప్రభాతవార్త :** గతంలో ముఖ్యమంత్రి కెసిఆర్ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని హామీ ఇచ్చారని వచ్చే ఎన్నికల్లోగా వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని సోమవారం అలంపూర్‌లో రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్‌కు వాల్మీకి సంఘం నాయకులు కలిసి వినతి పత్రం సమర్పించారు. సోమవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని లాస్ట్‌మంత్ సత్యవతి రాథోడ్ అలంపూర్‌లో వెలసిన ఐదవ శక్తిపీఠమైన జోగులాంబ అమ్మవారి దర్శనానికి రాగా ఈ సందర్భంగా వాల్మీకులు మంత్రిని కలిశారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకుగానే ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకుపోవాలని మంత్రికి వారు సూచించారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు నారాయణ నాయుడు, రమణ, మద్దిలేటి, పరశురాముడు, ఇతర వాల్మీకి సంఘం నాయకులు ఉన్నారు.

# ప్రతి వ్యక్తి న్యాయం పొందే హక్కును రాజ్యాంగం కల్పించింది...



న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ పి.నవీన్‌రావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 02, ప్రభాతవార్త:**రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి వ్యక్తికి న్యాయాన్ని పొందే హక్కు ఉందని తెలంగాణ రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అన్నారు. సోమవారం ఉదయం తెలంగాణ హైకోర్టు సమావేశ మందిరం నుంచి రాష్ట్రంలోని 23 నూతన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాలను రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ పి.నవీన్‌రావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏక కాలంలో ప్రారంభోత్సవం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రారంభోత్సవ కార్యక్రమం జిల్లా కోర్టు సముదాయ భవనంలో వర్చువల్ ద్వారా ప్రారంభం కాగా... జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జీ జస్టిస్ డి.రాజేష్‌బాబు, జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్, జిల్లా ఎస్పీ కె.మనోహర్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరి జస్టిస్ సబిత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ గుప్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్ మాట్లాడుతూ ప్రైవేటు లాయర్లను నియమించుకోలేని పేద ప్రజలకు సైతం న్యాయం పొందాలనే ఉద్దేశ్యంతో ఆర్టికల్ 21ను అనుసరించి 1987 యాక్ట్ నిబంధన 39(ఎ) ప్రకారం లీగల్ సర్వీస్ అథారిటీని ఏర్పాటు చేశామన్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ అనేది జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో ఉంటాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పరిపాలన జిల్లాలు 10 నుంచి 23 జిల్లాకు పెరిగినందున జ్యూడీషియల్ కోర్టులో సైతం 23 ఏర్పాటు చేశామన్నారు. ఒకేసారి కొత్తగా ఏర్పడిన 23 జిల్లాల్లో లీగల్ సర్వీసెస్ అథారిటీలను ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం జిల్లా జడ్జీ రాజేష్‌బాబు, జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్, ఎస్పీ కె.మనోహర్‌తో కలిసి లీగల్ సర్వీసెస్ అథారిటీ భవనానికి రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం జడ్జీ రమేష్‌బాబు, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్‌లు మాట్లాడుతూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ నాగర్‌కర్నూల్ జిల్లాలో ఏర్పాటు కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ వెనుకబడిన జిల్లా అని, జిల్లాలోని పేద ప్రజలు నిరక్షరాస్యులు, ప్రైవేటు లాయర్లను పెట్టుకునే స్తోమత లేని వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయం పొందేందుకు దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీ కె.స్వరూపల, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జీ పి.మౌనిక, బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్‌గుప్త, బార్ అసోసియేషన్ సెక్రటరి ఏ.పర్వత్‌రెడ్డి, జ్యూడీషియల్ అధికారులు తదితరులు ఉన్నారు.

# చెరువు శిఖాలకు కంచె ఏర్పాటు చేసి రక్షించాలి..

## బిజినేపల్లి సర్పంచ్ క్యామ బాలేశ్వర్ డిమాండ్ మండల మత్స్యకార సహకార సంఘం ఆధ్వర్యంలో శాంతియుత నిరసన దీక్ష



మత్స్యకారుల శాంతియుత నిరసన సభలో మాట్లాడుతున్న బిజినేపల్లి సర్పంచ్ క్యామ బాలేశ్వర్

**బిజినేపల్లి, జనవరి02ప్రభాతవార్త:**మండలకేంద్రంలోని మొద్దులకుంట, సాకలోని చెరువు, ఈదుల్ చెరువులను సర్వే చేసి శిఖం, బఫర్ జోన్‌లను గుర్తించి కంచె ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని స్థానిక సర్పంచ్ క్యామ బాలేశ్వర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ముందు సోమవారం మండల మత్స్యకార సహకార సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన శాంతియుత నిరసన దీక్షకు మద్దతుగా నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. కొందరు చెరువు శిఖం భూములను అక్రమంగా ఆక్రమించుకోవడంతో శిఖం విస్తీర్ణం తగ్గి మత్స్యకారులు సొసైటీలో సభ్యత్వాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఎక్కడికక్కడ చెరువులను కబ్జా చేయడంతో మత్స్యసంపద తగ్గి మత్స్యకారులకు జీవనోపాధి లేక తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నారని వాపోయారు. ఇప్పటికే ఎన్నోమార్లు రెవెన్యూ అధికారుల, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లిన వారు అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు,ప్రజాప్రతినిధులు స్పందించి చెరువులను రీ సర్వేచేయించి హద్దులు గుర్తించి కంచె ఏర్పాటు చేసి చెరువులను కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మత్స్యకారుల అభ్యున్నతి కోసం ఉచితంగా చేపపిల్లల పంపిణీ, చేపలు అమ్ముకునేందుకు అవసరమైన వాహనాలను అందజేసి ప్రోత్సహిస్తుంటే అందుకు విరుద్ధంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల వ్యవహరించడం శోచనీయమన్నారు. అనంతరంమండల మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు తుమ్మల అల్లోజి మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశంలో మత్స్యకారులకు జరుగుతున్న అన్యాయాన్ని వినతి పత్రం ద్వారా తెలియజేసిన ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారులను కొందరు ప్రజాప్రతినిధులు కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారు తప్పా వారిమేలు కోరడం లేదని విమర్శించారు. చెరువుల ఆక్రమణను అడ్డుకోకపోతే మత్స్యకార సహకార సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మిద్దె రాములు,మండల మత్స్యకార సహకార సంఘం ప్రధాన కార్యదర్శి మస్కూరి బంగారయ్య, తుమ్మల శేఖర్, పంపిండ్ల పర్వతాలు, కంపిండ్ల శ్రీనివాసులు, ఆంజనేయులు, శేఖర్,కంపిండ్ల లక్ష్మయ్య, కెబి శ్రీధర్, కె.నరసింహ, బి. ఈశ్వర్, కొండల్, మెట్టు శాంతయ్య, జి. తిరుపతయ్య, కంపిండ్ల వెంకట్రాములు, కె.రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

# పాలెం వెంకన్నస్వామి ఆలయానికి విరాళాల వెల్లువ

**1977 పదవ తరగతి బ్యాచ్ రూ. 10 లక్షల విరాళం ప్రకటన రూ. 3.5 లక్షలు పలువురు దాతల విరాళం**



రూ. 5 లక్షల చెక్కును అందజేస్తున్న 1977 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు

**బిజినేపల్లి, జనవరి 02 ప్రభాతవార్త :** ముక్కోటి ఏకాదశి పర్వదినాన పాలెం శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయానికి భక్తుల విరాళాలు వెల్లువెత్తాయి. మండలంలోని పాలెంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో భక్తుల ఉపయోగాలు నిర్మించ తలపెట్టిన షెడ్డుకు అయ్యే ఖర్చుకు తమవంతు సహాయంగా టిఎస్ఎం హైస్కూల్ 1977 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ. 10 లక్షల విరాళం అందజేయనున్నట్లు ప్రకటించి ఆలయ కమిటి ఛైర్మన్ జున్నశేఖర్ రెడ్డికి రూ. 5 లక్షల చెక్కును అందజేశారు. అలాగే పాలెం గ్రామానికి చెందిన గంధం నిచత వెంకటేశ్వర్లు రూ. 51116, నాగర్‌కర్నూల్‌కు చెందిన కర్లీ రేవతి, గోవర్ధన్ దంపతులు రూ. 51116, పెద్దపల్లి గ్రామానికి చెందిన కందూరు లక్ష్మి, లక్ష్మణస్వామి దంపతులు రూ. 51116, తెల్కపల్లి, నాగర్‌కర్నూల్‌కు చెందిన కోటగిరి విజయలక్ష్మి మనోహరర్‌రావు రూ. 51116, బాదం శ్రీనివాసులు రూ. 51116, నిచల్ స్వాతి లు రూ. 25116లు విరాళాలు ప్రకటించారు. ఆలయ కమిటి తరపున స్వామివారి కృపా కటాక్షాలు కలగాలని వారిని అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి రంగారావు, ప్రధాన అర్చకులు రామానుజాచార్యులు, ఎంపిపి పుప్పాల శ్రీనివాస్‌గౌడ్, గంధం వెంకటేశ్వర్లు, బాలస్వామి, గోపాలస్వామి, కురుమయ్య, సుబ్రహ్మణ్యం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన జిల్లా ఛైర్మన్



నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**ధరూర్, జనవరి 02 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని నడిగడ్డ హక్కుల పోరాట సమితి ధరూర్ మండల నూతన కార్యాలయాన్ని జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజి త్‌కుమార్, ధరూర్ మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవిందుతో కలిసి ప్రారంభిం చారు. అనంతరం మహనీయులు మహాత్మా జ్యోతిరావుపూలే, సావిత్రిభాయి పూలే, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా గొంగళ్ల రంజిత్‌కుమార్ మాట్లాడుతూ మండల పరిధిలోని ఆయా గ్రామా ల్లో ఉన్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు బాధ్యతాయుతంగా పనిచేస్తూ ఒక వేదికగా మండల కార్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ నడిగడ్డ ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, పేద వర్గాల ప్రజల సమస్యలను పట్టించుకునే నాధుడే లేడని అలాంటి వారికోసం పేద వర్గాల పక్షాన నిలబడి నీతి, నిజాయితీ, నిబద్ధతతో న్యాయమైన డిమాండ్లతో ప్రజల పక్షాన నిలబడి ప్రజల కోసం ప్రతినిత్యం పోరాటం చేస్తూ నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఒక వేదికగా ఉంటుందని అలాగే మండల, గ్రామాల పరిధిలో ఉన్న సమస్యలు ఏమైనా ఉంటే ప్రశ్నించడానికి నడిగడ్డ హక్కుల పోరాట సమితి ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, జిల్లా కార్యదర్శి లవన్న, సుదర్శన్, రంగస్వామి, మండల ఉపాధ్యక్షులు మునెప్ప, ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రాము, సహాయ కార్యదర్శిలు కె. రామకృష్ణ, తిప్పన్న, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శాంతన్న, సోషల్ మీడియా ఇంఛార్జి మల్లేష్, కార్యవర్గ సభ్యులు మద్దిలేటి, రమేష్, ధరూర్ మండల నాయకులు జగదీష్, జమ్మన్న, ఉప్పేర్ రంజిత్‌గౌడ్,రాము, సంజీవులు, మల్దకల్ మండల నాయకులు విష్ణు, అవనిశ్రీ, లక్ష్మన్న, చిన్నరాముడు, గట్టు మండల నాయకులు ఆలూరు వెంకట్రాములు, కెటిదొడ్డి మండల నాయకులు సామియేల్, స్వామి, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# రంగనాయక స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు..



వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్తాబైన శ్రీదేవి, భూదేవి సమేత రంగనాయక స్వామి

**శ్రీరంగాపురం, జనవరి 02 ప్రభాతవార్త:** వైకుంఠదామ ఏకాదశి పర్వదిన సందర్భంగా తెల్లవారుజాము నుండి మండల కేంద్రంలోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో భక్తులతో కిటకిటలాడింది. శ్రీదేవి భూదేవి సమేత రంగనాయక స్వామి అవతారంలో భక్తులకు దర్శనం ఇస్తున్నారు స్వామివారు. రంగనాథ స్వామి, అమ్మవారు లను ఉత్తర ద్వారం నుండి దర్శించుకునేలా ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. గోవిందా నామస్మరణలతో ఆయన ప్రాంగణం మార్మోగింది. ఆలయ అర్చకులు మాట్లాడుతూ విష్ణుమూర్తికి ఇష్టమైన తిథి ఏకాదశి అని చంద్రమాసం ప్రకారం ప్రతి మాసం శుక్ల పక్షంలో 11వ తిథి, కృష్ణపక్షంలో 11వ తిథియే ఏకాదశి అని రెండు ఏకాదశులు అంటే ఏడాదికి 24 ఏకాదశులు వస్తాయన్నారు. గరుడ వాహనదారుడైన విష్ణువు ఈ ముక్కోటి ఏకాదశి రోజున దేవతలతో కలిసి భూలోకానికి వచ్చి భక్తులకు తన దివ్యరూపంలో దర్శనమిస్తారని అన్నారు. అందుకే ఈ ఏకాదశిని ముక్కోటి ఏకాదశి అని అంటుంటారని అన్నారు. ఈ పర్వదినాన ఏకాదశి వ్రతాన్ని ఆచరిస్తే కోట్లలో ఏకాదశి వ్రతాలు చేసిన దానితో సమానమని విష్ణు పురాణాల్లో రాసి ఉందని అన్నారు. ఏకాదశి రోజంతి ఉపవాసం ఉండేవారు సత్యవ్రతాన్ని, బ్రహ్మచర్యాన్ని పాటించాలని అన్నారు. రోజంతా హరినామాన్ని జపిస్తే మేలు జరుగుతుందన్నారు. కాగా ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకోని ఆలయాల్లో ప్రత్యేకంగా ఉత్తర ద్వారాలను ఏర్పాటు చేశారు. ఆలయాల్లోని ఉత్సవమూర్తుల విగ్రహాలను ఉత్తర ద్వారంలో వేయింపజేసి సుందరంగా అలంకరించారు. ఉదయం 5గంటల నుండి ఉత్తర ద్వారాం తెరిచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అప్పటికే బారులుదీరిన భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకునీ పునీతులయ్యారు. సాయంత్రం 6గంటల సమయంలో కూడా ఆలయంలో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, సుదూర ఇతర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించిన సర్పంచ్ జయరాములు నాయక్..



**వనపర్తి రూరల్, జనవరి 02 ప్రభాతవార్త:** వనపర్తి మండల పరిధిలోని పెద్దతాండ గ్రామంలో జరుగుతున్న బీటీ రోడ్డు నిర్మాణం పనులలో భాగంగా సోమవారం సీసీ రోడ్డు నిర్మాణం పనులు సర్పంచ్ జయరాములు నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ సుదర్శన్ రెడ్డి, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు సర్యా, బీఆర్ఎస్ గ్రామ కార్యకర్తలు నర్సింగ్ నాయక్, కె.బుచ్యా, ఎం.సురేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



**అచ్చంపేట, జనవరి 02, ప్రభాతవార్త:**వైకుంఠ ఏకాదశి సందర్భంగా అచ్చంపేట నియోజ కవర్గంలోని మామిళ్లపల్లి గ్రామంలోని లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువా లతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కట్ట అనంతరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మోహన్‌గౌడ్, రాజరావు, మధుసూదన్ గౌడ తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మండల నాయకులు



**వెల్దండ, జనవరి 02, ప్రభాతవార్త:** ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను సోమవారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో వెల్దండ నాయకులు జైపాల్‌నాయక్, గోపాల్‌నాయక్, ఎంపీటీసీలు గుత్తి వెంకటయ్య, నీరటి రాములు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నాయకత్వంలో మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, మరిన్ని నిధులు తీసుకొచ్చి గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామన్నారు.

## ప్రజావాణి సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలి:ఎస్పి



**వనపర్తి ప్రతినిధి, జనవరి 02 ప్రభాతవార్త:** జిల్లాలోని పలు ప్రాంతాల నుండి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుదారుల నుండి 05 ఫిర్యాదులు వచ్చినట్లు జిల్లా ఎస్పీ అపూర్వరావు తెలిపారు. ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలపే అడిగి తెలుసుకొని సంబందిత పోలీసు అధికారులకు ఫిర్యాదుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు.

## ఘనంగా వైకుంఠ ఏకాదశి..



**వనపర్తి టౌన్, జనవరి 02 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలోని పాండురంగ నాయక స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం తెల్లవారుజామున పాండురంగ నాయక స్వామి పల్లకి మోయడం చాలా ఆనందంగా ఉందని, అదృష్టంగా భావిస్తున్నానని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా దేవాలయ బ్రాహ్మణ వేద పండితులు కమిటీ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. వనపర్తి నియోజకవర్గ ప్రజలకు వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పూజ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ బీజేపీ కౌన్సిలర్ బి.రమాదేవి పాల్గొన్నారు.

## జడ్చర్లలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పర్యటన

**రాజాపూర్, జనవరి 02 ప్రభాతవార్త :** జడ్చర్ల మండలంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పర్యటనలో భాగంగా మార్గమధ్యలో పెద్ద అదిరాల గ్రామంలో నిర్మిస్తున్న 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని (పిహెచ్‌సి)ని పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణ ప్రక్రియ గురించి కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ సివిల్ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆసుపత్రి నిర్మాణంలో ఎటువంటి రాజీ లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. త్వరలోనే ఆసపత్రి నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న అయ్యప్పస్వామి దేవాలయాన్ని పరిశీలించారు.

## టీటీడీ చైర్మన్‌ను సన్మానించిన జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 02, ప్రభాతవార్త:** తిరుమల తిరుపతి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని వెంకటేశ్వర స్వామిని నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థాన చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డిని ఆయన కార్యాలయంలో ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సన్మానించిన వారిలో ఉప్పు ఆంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్, అశోక్ తదితరులు ఉన్నారు.



## పాగుంట వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణమ్మ

**కేటిదొడ్డి, జనవరి 02 ప్రభాతవార్త :** కేటిదొడ్డి మండల పరిధిలోని పాగుంట వెంకటేశ్వర స్వామిని వైకుంఠ ఏకాదశి సందర్భంగా బిజెపి మండల ఉపాధ్యక్షురాలు డికె అరుణ ఉత్తర ద్వారం ద్వారా దర్శంచుకున్నారు. అంతకు ముందు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడ్డం కృష్ణారెడ్డి, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు మిర్జాపురం రామచంద్రారెడ్డి, బండ్ల పద్మావతి వెంకట్రాములు, తిమ్మారెడ్డి, మహానందిరెడ్డి, తిరుపతి, శ్రీను, అశోక్, జంగిలప్ప తదితరులు పాల్గొన్నారు.



## స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్‌గా ఆంజనేయగౌడ్ ఉత్తర్వులు జారీ చేసిన సర్కార్

**గతంలో బీసీ కమిషన్ మెంబర్‌గా సేవలు ఉమ్మడి పాలమూరు జిల్లాకు గుర్తింపు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి2, ప్రభాతవార్త :** తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్(సాట్)గా డాక్టర్ ఈడిగా ఆంజనేయగౌడ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. ఈమేరకు ప్రగతిభవన్‌లో సోమవారం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నియామక పత్రాన్ని అందజేశారు. చైర్మన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 2016లో తెలంగాణలో నూతనంగా ఏర్పాటైన బీసీ కమిషన్ మెంబర్‌గా ఆంజనేయగౌడ్ సేవలందించారు. కమిషన్ తరఫున ఎన్నో రకాల కార్యక్రమాలు నిర్వహించిన నిస్సహాయులకు అండగా నిలబడ్డారు.



**ఉమ్మడి పాలమూరుకు చెందిన వ్యక్తిగా..** ఆంజనేయగౌడ్ ఉమ్మడి పాలమూరుకు చెందిన వ్యక్తి. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం ఆలూరు గ్రామానికి చెందినవాడు. ఇతడు గతంలో బీసీ కమిషన్ మెంబర్‌గా ఉన్న సమయంలో ఉమ్మడి జిల్లాలో చాలాసార్లు పర్యటించారు. అధికార యంత్రాంగంతో సమీక్షలు నిర్వహిస్తూ తన శక్తిమేరకు అభాగ్యులకు అండగా నిలిచారు. కమిషన్ తరఫున పూర్తి స్థాయిలో సహాయసహకారాలు అందించారు. ఆంజనేయగౌడ్ గతంలో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పొందారు. ప్రస్తుతం సాట్ చైర్మన్‌గా నియామకం కావడంతో ఉమ్మడి జిల్లాలో హర్షం వ్యక్తమవుతున్నది.

## విద్యార్థులకు సోషల్ టాలెంట్ టెస్ట్:డిఈఓ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 02, ప్రభాతవార్త:**విద్యార్థుల్లో అభ్యసనం పట్ల ఆసక్తిని పెంచుటకు 10వ తరగతి పరీక్షలకు సన్నద్ధం చేయుటకు జిల్లాలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని డీఈఓ గోవిందరాజులు తెలిపారు. 10వ తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి ఏప్రిల్ 13వ తేదీ వరకు జరగనున్నాయని, విద్యార్థులను సబ్జెక్టుల వారిగా సన్నద్ధంలో భాగంగా సాంఘీక శాస్త్ర విషయ అవగాహన పెంపొందించుటకు సాంఘీక శాస్త్ర అంశాల పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించుటకు పరీక్షల పట్ల ఉన్న భయాన్ని పోగొట్టుటకు మండల స్థాయిలో మరియు జిల్లా స్థాయిలో 10వ తరగతి విద్యార్థులకు సోషల్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు.

## రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలి:జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 02, ప్రభాతవార్త:** నూతన సంవత్సరంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మరింత రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి జిల్లాను ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. 2023 నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం తనను కలిసిన జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి కలెక్టర్ నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంలో అన్ని శాఖల ఉద్యోగులు, ప్రజలు, మీడియా సహకారం అందిస్తున్నారని, ఇదే సహకారాన్ని కొనసాగించాలని కోరారు. జిల్లా ఎస్పీ కె.మనోహర్, అదనపు కలెక్టర్ ఎస్.మోతీలాల, డీఎంహెచ్ఓ సుధాకర్‌లాల్, డీపీఆర్ఓ సీతారాం, డీఈఓ గోవిందరాజులు, బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు, మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప, మార్కెటింగ్ అధికారిణి బాలమణి, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



## ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి..

**జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష**

**వనపర్తి ప్రతినిధి, జనవరి 02 ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించి దరఖాస్తుదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షేక్‌యాస్మిన్ భాష జిల్లా అధికారులకు ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి జనరల్ కేటగిరీ నుండి 26 దరఖాస్తులను, పెన్షన్లకు సంబందించిన 8 ఫిర్యాదులు మొత్తం 34 దరఖాస్తులను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కొరకు పెట్టుకున్న అర్జీలకు అధికారులు ప్రాధాన్యం ఇచ్చి వెంటనే పరిష్కరించే దిశగా కృషి చేయాలని ఆమె తెలిపారు. అనంతరం జిల్లా అధికారులతో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సకాలంలో అమలు చేసి లబ్దిదారులకు అందే విధంగా కృషి చేయాలని ఆమె సూచించారు. ప్రతి జిల్లా అధికారి తమ బాధ్యతలను చక్కగా నిర్వర్తిస్తూ, ప్రజలకు సేవలను అందిస్తూ, అందరికి సమన్వయంతో వారి అభివృద్ధికి తోడ్పాటును అందించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్, వివిధ శాకల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణిలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలి...

**-జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.మోతిలాల్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 02, ప్రభాతవార్త:**ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలకు అధికారులు కృషి చేసి అధిక ప్రాధాన్యతనిచ్చి వెంటనే పరిష్కారం చూపాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.మోతిలాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 46 ధరఖాస్తులు వచ్చాయని, వాటిలో ధరణి భూ సమస్యలు, వృద్ధాప్య ఫించన్లు, స్వయం ఉపాధి వంటి సమస్యలకు సంబంధించిన ధరఖాస్తులను అదనపు కలెక్టర్ మోతిలాల్, డీఆర్డీఓ నర్సింగ్‌రావుతో కలిసి స్వీకరించారు. ప్రజల నుంచి అందిన ధరఖాస్తులను వెంటనే పరిష్కరించుటకు సంబంధిత శాఖలకు ఎండార్స్ చేసి సిఫారసు చేశారు. ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తులను ప్రాధాన్యతనిస్తూ వెంటనే పరిష్కరించాలని, సంబంధిత అధికారులను జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ మోతిలాల్ అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.



# ప్రతి వ్యక్తికి న్యాయం పొందే హక్కు ఉంది..

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 02 ప్రభాతవార్త :** రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ (21) ప్రకారం వ్యక్తి వ్యక్తికి న్యాయాన్ని పొందే హక్కు ఉందని తెలంగాణ రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అన్నారు. సోమవారం ఉదయం తెలంగాణా హైకోర్టు సమావేశ మందిరం నుండి రాష్ట్రంలోని (23) నూతన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాలను రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ పి. నవీన్‌రావుతో కలిసి విడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏకకాలంలో ప్రారంభోత్సవం చేశారు. నారాయణపేట జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ప్రారంభోత్సవ కార్యక్రమం జిల్లా కోర్టు సముదాయ భవనంలో వర్చువల్ ద్వారా ప్రారంభం జరగగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జస్టిస్ మహ్మద్ అబ్దుల్ రఫీ, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ కం సీనియర్ సివిల్ జడ్జి జి. శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దామోదర్‌గౌడ్ ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ మాట్లాడుతూ ప్రైవేట్ లాయర్లను నియమించుకోలేని పేద ప్రజలకు సైతం న్యాయం పొందాలనే ఉద్దేశంతో ఆర్టికల్ (21)ను అనుసరించి 1987 యాక్టు నిబంధన (39)(ఎ) ప్రకారం లీగల్ సర్వీస్ అథారిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ అనేది జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉంటాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పరిపాలన జిల్లాలు 10 నుండి 23కు పెరిగినందున జ్యుడిషియల్ కోర్టులో సైతం 23 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈరోజు ఒకేసారి కొత్తగా ఏర్పడిన 23 జిల్లాలలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలను ప్రారంభోత్సవం చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈరోజు నుండి రాష్ట్రంలోని అన్ని 33 జిల్లాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థలు పనిచేయడం ప్రారంభిస్తాయని, ప్రయివేట్ లాయర్లను నియమించుకునే స్థితిలో లేని ప్రతి ఒక్కరికి న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా వాదించి న్యాయం చేకూర్చడం జరుగుతుందన్నారు. అదేవిధంగా గ్రామస్థాయిలో ప్రజలకు చట్టాలపై, లీగల్ సర్వీసెస్ అథారిటీ సేవలపై విస్తృతంగా అవగాహన కల్పించడం జరుగుతుందని తెలియజేశారు. అనంతరం నారాయణపేట జిల్లా కోర్టు భవన ప్రారంభోత్సవానికి ప్రత్యక్షంగా హాజరైన ప్రిన్సిపల్ జిల్లా జడ్జి మహ్మద్ అబ్దుల్ రఫీ, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి లీగల్ సర్వీసెస్ అథారిటీ భవనానికి రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ నారాయణపేట జిల్లాలో ఏర్పాటు కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. నారాయణపేట వెనుకబడిన జిల్లా అని, జిల్లాలోని పేదప్రజలు నిరక్షరాస్యులు ప్రయివేట్ లాయర్లను పెట్టుకునే స్థోమత లేనివారు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయం పొందేందుకు దోహదపడుతుందన్నారు. జిల్లా యంత్రాంగం తరపున అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, జి.శ్రీనివాస్ సీనియర్ సివిల్ జడ్జి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి మొహ్మద్ ఉమర్, అడిషనల్ జూనియర్ సివిల్ జెడ్జు య్యద్ జకియా సుల్తాన, పిపి సురేష్, డీఎస్పీ సత్యనారాయణ, బార్ కనొసిల్ ప్రెసిడెంట్ దామోదర్‌గౌడ్, సీనియర్ న్యాయవాది నాగూరావు నామాజీ, సతీష్‌గౌడ్, న్యాయవాదులు సలీం, నారాయణ, రఘువరా యాదవ్, లక్ష్మిపతిగౌడ్, నందు నామాజీ, సీతారామారావు, కుర్మన్న, భీంరెడ్డి, వెంకట్‌రెడ్డి, మదన్, ఆకుల బాలప్ప, రాజేశ్వర్‌గౌడ్, నర్సిములు యాదవ్, రాజవర్ధన్‌రెడ్డి, నాగేశ్వరి, ప్రవీణ్ నామాజీ, నర్సింలు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ తదితరులు

## కల్వకుర్తిలో ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు..

**కల్వకుర్తి, జనవరి 02, ప్రభాతవార్త:**వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా కల్వకుర్తి పట్టణంలో శ్రీశ్రీశ్రీ వాసవీమాత కన్యకాపరమేశ్వరి, శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవాలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయాలకు ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని స్వామి వారికి తెల్లవారుజాము నుంచే ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయం కొత్త శోభను సంతరించుకుంది. వెంకటేశ్వరస్వామి స్వామి ఆలయంలో వాసవీక్లబ్, వనితాక్లబ్‌ల ఆధ్వర్యంలో ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ కల్వ మనోహర్ అధ్యక్షతన అంతర్జాతీయ ఉపాధ్యక్షులు విద్య సంకల్ప్, ఇంటర్నేషనల్ డైరెక్టర్ జూలూరి రమేష్‌బాబు, కల్వ హరికృష్ణ, ఎరివెంటి రమేష్, కలిమిచెర్ల రమేష్, కొందూర్ గోవర్ధన్, శ్రీధర్, శివ్వ జగదీశ్వర్, మనోహర్, శంకర్, గోపాల్, ఎన్.లింగం, కృష్ణయ్య, రమేష్‌లు కుటుంబ సభ్యులతో పాటు పలువురు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన ప్రసాద కార్యక్రమంలో పాల్గొని పంపిణీ చేశారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**భక్తి శ్రద్ధలతో జనార్ధన స్వామికి ప్రత్యేక పూజలు:**

వైకుంఠ ఏకాదశి సందర్భంగా పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలోని కొలకమాన జనార్ధన స్వామికి సోమవారం ఆలయ ట్రస్ట్ చైర్మన్ జూలూరి రమేష్‌బాబు ఆధ్వర్యంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా భక్తులకు ఉత్తర ద్వారా దర్శనం కల్పించారు. పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి విచ్చేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చిగుల్లపల్లి శ్రీధర్, కంది ప్రవీణ్, దుగ్గి వెంకటేష్, రాఘవేందర్, భక్తులు తదితరులు ఉన్నారు.

## వైభవంగా ముక్కోటి ఏకాదశి ఉత్తరద్వార దర్శనం

**తెల్లవారుజాము నుంచే భక్తులతో ఆలయాలు కిటకిట**

**బిజినేపల్లిజనవరి 02 ప్రభాతవార్త :** వైకుంఠ ఏకాదశి నాడు ఉత్తర ద్వార శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే అంతా మంచే జరుగుతుందని భక్తుల విశ్వాసం. సోమవారం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని పాలెం, వట్టెం, బిజినేపల్లి గ్రామాలలోని వెంకన్న ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున 4 గం.ల నుండే భక్తుల తాకిడి ఆలయాలకు మొదలైంది. ఆలయాలలో ప్రత్యేక పూజలు చేసేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులను ఆయా ఆలయాల కమిటి సభ్యులు, వాలంటీర్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన భక్తులకు వేద పండితుల ఆశీర్వాదం, తీర్థ ప్రసాదాల వితరణ చేపట్టారు. కార్యక్రమంలో బిజినేపల్లి ఆలయ కమిటి చైర్మన్ కుబిరెడ్డి తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కావలి నిరంజన్, కోశాధికారి కత్తె వెంకన్న, సభ్యులు రాజేందర్‌గౌడ్, కర్నాటి తిరుపతయ్య, ముద్దం మధుసూదన్‌రెడ్డి, హరికిషన్, పిట్టల సురేష్, శ్రీనివాసులు, శివగణేష్, రంగ నరెందర్, ప్రధాన అర్చకులు తిరుమల వెంకటాచార్యులు, వట్టెం ఆలయ కమిటి సభ్యులు రాష్ట్ర బార్ కౌన్సిల్ అధ్యక్షుడు అనంత నరసింహారెడ్డి, సందడి ప్రతాపరెడ్డి, సందడి నరెందర్‌రెడ్డి, భాస్కరాచారి, పాలెంఆలయ కమిటి సభ్యులు సొప్పరి బాలస్వామి, గంధం వెంకటేశ్వర్లు, గాడి సురెందర్, ఈఓ రంగారావు, భక్తులు పాల్గొన్నారు.



ఉత్తర ద్వార దర్శనానికి క్యూలో నిలబడ్డ భక్తులు

## జాప్యం లేకుండా ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి:జిల్లా కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 02 ప్రభాతవార్త:** ప్రజావాణితో పాటు వివిధ సందర్భలలో ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటరావు కోరారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన నూనత కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులు, రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన ఫిర్యాదులు అదే విధంగా వివిధ రకాల సమస్యలపై ప్రజలు సమర్పించిన అన్ని ఫిర్యాదులను ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని అన్నారు. ప్రజలు వారి సమస్యలను పరిష్కారం అవుతాయి అన్న భరోసాతో జిల్లా కేంద్రానికి వచ్చి ఫిర్యాదులను సమర్పిస్తున్నారని, అందువల్ల వీలైతే తక్షణమే వారి ఫిర్యాదులను పరిష్కరించేందుకు చూడాలి అన్నారు. ఒకవేళ వీలేకాని పక్షంలో ఎందుకు పరిష్కరించడం లేదో పూర్తి వివరణ ఫిర్యాదు దారుకు తెలియజేయాలని అన్నారు. ఉన్నతాధికారుల పరిధిలో పరిష్కరం అయ్యే సమస్యలకు వారి దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా ఆ సమస్య పరిష్కారం అయ్యేవరకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కాగా సోమవారం 116మంది ఫిర్యాదుదారులు ఫిర్యాదులు సమర్పించారని అన్నారు. కొన్ని ఫిర్యాదులు జిల్లా కలెక్టర్ అప్పటికప్పుడే జిల్లా అధికారులను తన దగ్గర పిలిపించుకుని పరిష్కరించే ప్రయత్నం చేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని పలువురు జిల్లా అధికారులు జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, జడ్పీ సీఈఓ జ్యోతి, స్పెషల్ కలెక్టర్ పద్మశ్రీ, ఆర్డీఓ అనిల్ కుమార్, డీఆర్డీఓ యాదయ్య, జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు. అనంతరం జిల్లా అగ్నిమాపక శాఖ ద్వారా వంట గదిలో సంభవించే అగ్ని ప్రమాదాలను అరికట్టే విషయమై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వీడియో ద్వారా వివరించారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రారంభం..

**వర్చువల్‌గా ప్రారంభించిన రాష్ట్ర ఛీఫ్ జస్టిస్ ఉజ్వల్ భూయాన్**

**వనపర్తి క్రైమ్, జనవరి 02 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కు నూతనంగా మంజూరైన న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని సోమవారం రాష్ట్ర హైకోర్టు ఛీఫ్ జస్టిస్ ఉజ్వల్ భూయాన్ వర్చువల్ గా ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వనపర్తి జిల్లా జడ్జి కోర్టు హాల్లో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ స్క్రీన్‌లో తిలకించారు. తెలంగాణ హైకోర్టు 23 కొత్త జిల్లాలకు న్యాయ సేవాధికార సంస్థలను మంజూరు చేసిందని, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అధికారి నవీన్‌రావు వెల్లడించారు. జిల్లా ప్రజలకు మెరుగైన న్యాయ సేవలు అందుబాటులోకి వస్తాయని సంస్థ ద్వారా ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా న్యాయమూర్తి ముజీజ్ అహ్మద్ ఖాన్, సీనియర్ సివిల్ జడ్జి రజిని, జూనియర్ న్యాయమూర్తులు జానకి, రవి కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు భరత్ కుమార్, కార్యదర్శి విజయభాస్కర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం..

**వీపనగండ్ల, జనవరి 02 ప్రభాతవార్త:** టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పిలుపుమేరకు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రంగినేని అభిలాషరావు ఆదేశాల మేరకు వీపనగండ్ల మండల కేంద్రంలో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు నక్క విష్ణు మాట్లాడుతూ సర్పంచుల నిధుల నుండి రాష్ట్ర ప్రభుతన నిర్లక్ష్యంపై టీపీసీసీ రాజీవ్ గాంధీ పంచాయితీ రాజ్ సంఘటన ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం ఇంద్రపార్క్ వద్ద జరగాల్సిన ధర్నాకు ప్రభుత్వం అనుమతి నిర్కారించింది. అదే విధంగా ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డిని అలాగే తెలంగాణ రాష్ట్రంలో ముఖ్య నాయకులు అందరిని ఉదయం నుండి హౌస్ అరెస్టు చేసి ఒక నిరంకుశ పాలనకు తెరలేపిన కారణంగా టీపీసీసీ ఆదేశాల మేరకు వీపనగండ్ల మండల కేంద్రంలోని కేసీఆర్ దిష్టిబొమ్మ ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దహనం చేసి నిరసన తెలియజేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మీసాల పెద్దరాములు, కాంగ్రెస్ పార్టీ వీపనగండ్ల గ్రామ అధ్యక్షులు నక్క రాములు విష్ణు, సాయిబాబ నాయుడు, సతీష్ నాయుడు, ఎండి అక్తార్, యువ నాయకులు వంశీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏబీ బర్దన్ రాజకీయ జీవితం భావితరాలకు ఆదర్శప్రాయం..

**వనపర్తి టౌన్, జనవరి 02 ప్రభాతవార్త:** ఆర్దేందు భూషణ్ బర్దన్ ఆరు దశాబ్దాల మచ్చలేని రాజకీయ జీవితం భావితరాలకు ఆదర్శప్రాయమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీపీఐ అనుబంధ జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు పి.కళావతమ్మ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కె.శ్రీరామ్ అన్నారు. సోమవారం వనపర్తి సీపీఐ కార్యాలయంలో 7వ వర్దంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా అనుబంధం ఉందని అన్నారు. బాలానగర్ మండలం గుడ్ల పొట్లంపల్లిలో ఐరన్ ఫ్యాక్టరీ కాలుష్యంతో రైతుల పంటల నష్టాన్ని సీపీఐ బృందంతో పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారని పేర్కొన్నారు. 1925 లో జన్మించిన ఆయన 2016లో అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి జె.రమేష్, సహాయ కార్యదర్శి ఎర్రకురమ్మయ్య, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వంశీ, మహిళా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు జయ తదితరులు పాల్గొన్నారు.

## మొక్క నాటిన ఎంపీ మన్నె..!

**గ్రీన్‌ఇండియా చాలెంజ్ స్వీకరణ**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జనవరి2, ప్రభాతవార్త:** తన జన్మదినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాసరెడ్డి సోమవారం మొక్క నాటారు. ఈమేరకు మంత్రాలయంలో శ్రీ గురు రాఘవేంద్ర స్వామి దర్శనం అనంతరం ఆలయం ఆవరణలో మొక్క నాటారు. గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా మొక్క నాటినట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, హరితహారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.



## పాగుంట వెంకన్నస్వామిని దర్శించుకున్న గద్వాల డీఎస్పీ

**డీఎస్పీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఈఓ, పూజారులు**

**కేటిదొడ్డి, జనవరి 02 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పాగుంట వెంకటాపురం గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనంతో భక్తులు పులకించిపోయారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని గద్వాల డీఎస్పీ ఎన్‌సిహెచ్ రంగస్వామి సతీసమేతంగా పాగుంట వెంకటేశ్వరస్వామివారి దర్శనం చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ రంగస్వామి సంవత్సరానికి ఒకసారి వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని ఈఓ పురెందర్, అర్చకుల ఆధ్వర్యంలో 4 గం.లకు ఉత్తర ద్వారం ద్వారా అర్చకుల, పూజారులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. డీఎస్పీ రంగస్వామి దర్శనానంతరం దేవాలయానికి సంబంధించిన పూలతోటలో మొక్కలు నాటారు. అదేవిధంగా నూతన సంవత్సర వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, మండల ఎస్పై వి. వెంకటేష్, ఎఎస్పై జిక్కిబాబు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళా మృతి

**వెల్దండ, జనవరి 02, ప్రభాతవార్త:**గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళా మృతి చెందిన సంఘటన వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... వంగూరు మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన ముద్దమల్ల శ్రీను, అతని భార్య చెన్నమ్మ(32)లు మైసిగండి మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బంధువులతో కలిసి స్వగ్రామానికి ఆటోలో వెళ్తుండగా పెద్దాపూర్ గ్రామశివారులో ఆటోనిలిపి మలమూత్రవిసర్జనకు చెన్నమ్మ రోడ్డు దాటి తిరిగి వస్తున్న క్రమంలో శ్రీశైలం వైపునుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొనడంతో సంఘటనలో తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం కల్వకుర్తికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతురాలి భర్త శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

## రాష్ట్ర ఫైనాన్షియల్ కార్యదర్శి రొనాల్డ్‌రోస్‌ను కలిసిన సర్పంచ్‌ల సంఘం సభ్యులు

**రాజాపూర్, జనవరి 02 ప్రభాతవార్త :** రాష్ట్ర ఫైనాన్షియల్ కార్యదర్శి రొనాల్డ్ రోస్‌ను సోమవారం హైదరాబాద్‌లోని జిల్లా సర్పంచ్‌ల సంఘం తరపున కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో గ్రామాల్లో జరిగే పలు అంశాల గురించి చర్చించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. జిల్లా సర్పంచ్‌ల సంఘం తరపున జిల్లాకు రావాలని ఆహ్వానించారు. వీలు చూసుకుని వస్తానని చెప్పినట్లు వారు తెలిపారు. సానుకూలంగా స్పందించి రొనాల్డ్‌రోస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచ్‌ల సంఘం ప్రచార కార్యదర్శి నేరళ్ల గంగాధర్‌గౌడ్ (సర్పంచ్ రాయపల్లి), గోవిందనాయక్ బీబీసీగర్ సర్పంచ్, దొండ్లపల్లి సర్పంచ్ లక్ష్మిదేవి రంజిత్‌గౌడ్, ముదిరెడ్డిపల్లి ఎంపిటిసి శేఖర్‌గౌడ్, జిల్లా ట్రెనింగ్ మేనేజర్ వెంకటయ్య పాల్గొన్నారు.

## వెంకటేశ్వరస్వామి, జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న ఢిల్లీ అధికార ప్రతినిధి మంద

**ఇటిక్యాల, జనవరి 02 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెద్దదిన్నె గ్రామంలో వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి జాతర బ్రహ్మోత్సవాల సందర్భంగా వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం ఢిల్లీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపి మంద జగన్నాథం ఆలయానికి చేరుకోగా వారికి ఆలయ ధర్మకర్త జయసింహ, సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనాథ్‌రెడ్డి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనచే ఆలయంలో ప్రత్యేకపూజలు చేయించి స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈసందర్భంగా ఆలయ ధర్మకర్త జయసింహయ్య వారి కుమారుడు ఇటీవల పాముకాటుకు గురవడంతో వారి ఇంటికి వెళ్లి ఏఈఓ భరత్‌సింహను పరామర్శించారు. ఈ సందర్భంగా ఢిల్లీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపి మంద జగన్నాథం, బిఆర్ఎస్ పార్టీ అలంపూర్ మాజీ ఇంఛార్జి మంద శ్రీనాథ్, అలంపూర్ మాజీ మార్కెట్ యార్డుచైర్మన్ రాందేవ్‌రెడ్డిలను ఘనంగా శాలువాలతో సత్కరించారు. అనంతరం పట్టణంలో వెలసిన జోగులాంబ అమ్మవారిని ఢిల్లీ అధికార ప్రతి నిధి, మాజీ ఎంపి మంద జగన్నాథం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

## అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు..

**ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారి పర్వతాలు**

**బిజినేపల్లి, జనవరి 02 ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీ నిధుల విషయంలో ఆడుతున్న డ్రామాలకు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన ధర్నాను అడ్డుకోవడానికి రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల ముందస్తు అక్రమ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు పర్వతాలు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిపిసిసి రాష్ట్ర అధ్యక్షులు ఎనుముల రేవంత్ రెడ్డిని గృహనిర్బంధం చేసి అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని కూని చేయడమేనని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం రాజ్యాంగం కల్పించిన హక్కని, ఆ హక్కును బిఆర్ఎస్ ప్రభుత్వం కాలరాయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సైతం ఇలాంటి నిర్బంధాలు చూడలేదని బిఆర్ఎస్ పాలన నియంత పాలనను తలపిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.